క్లుప్తంగా

జాతీయ రహదారిపై ప్రత్యేక శానిటేషన్



పవర-పంద్రవాడ మధ్య నిర్వహిస్తున్న పారిశుధ్య పనులు

సామర్లకోట: పిఠాపురం నుంచి కాకినాడ వరకున్న 216 జాతీయ రహదారిలో మండలంలోని వివిధ గ్రామాల అధికారులు ఆదివారం ప్రత్యేక శానిటేషన్ పనులు నిర్వహించారు. సోమవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ రోడ్డు మీదుగా పర్యటించనున్నారు. దాంతో ఈ జాతీయ రహదారి వెంబడి ఉన్న పవర, పంద్రవాడ గ్రామాలకు చెందిన పంచాయతీ అధికారులు శానిటేషన్ పనులను చేయించారు. ఆయా పనులను ఈఓపీఆర్డీ భైరవమూర్తి పర్యవేక్షించారు. రోడ్లు, పరిసరాలు శుభ్రంగా ఉండాలంటే.. నిత్యం మంత్రుల పర్యటనలు ఉండాలా అని జనం చెవులు కొరుక్కున్నారు.

ఎంపీటీసీకి దొరబాబు పరామర్శ



బుచ్చిరాజును పరామర్శిస్తున్న దొరబాబు

సామర్లకోట: పెద్దాపురం మండలం తిరుపతి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు కుంచే బుచ్చిరాజును వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆదివారం పరామర్శించారు. అనారోగ్య కారణాలతో బుచ్చిరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై దొరబాబు ఆరా తీశారు. ఆయన వెంట జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు తదితరులు ఉన్నారు.

నేడు మత్స్యకార సొసైటీల ఎన్నికలు

సామర్లకోట: మండలంలోని మత్స్యకార సొసైటీలకు సోమవారం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. సామర్లకోట, వేట్లపాలెం, పీబీ దేవం, నవర ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీలకు ఎన్నికలు సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని ఎండీఓ ప్రకాశరావు తెలిపారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఈ సొసైటీల్లో అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుంటారన్నారు. సామర్లకోట సొసైటీలో 109 మంది, వేట్లపాలెంలో 136, పీబీ దేవంలో 109, నవరలో 23 మంది సభ్యులున్నారని వివరించారు. జి.మేడపాడు సొసైటీకి మూడేళ్ల క్రితం ఎన్నికలు జరిగాయని చెప్పారు. నాలుగు సొసైటీల ఎన్నికలకు ఆ శాఖకు చెందిన అధికారులు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ ఎన్నికలు చేతులెత్తే పద్ధతిలో జరుగుతాయన్నారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు ఏర్పాట్లు

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం పిఠాపురం నియోజకవర్గ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ రాహుల్ మీనా, ఇతర అధికారులతో కలిసి గొల్లప్రోలు, పిఠాపురం, పి.వెంకటాపురం, యు.కొత్తపల్లిల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో పలు అభివృద్ధి, నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపనలు, ప్రారంభాలు చేయనున్నారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు, కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, డీఈఓ పి.రమేష్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఉత్సాహంగా భగినీ హస్త భోజనాలు

సామర్లకోట: కార్తిక మాసం ప్రారంభం కావడంతో భగినీ హస్త భోజనాల కార్యక్రమాలు ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. కార్తిక మాసం విదియ శుక్ల పక్షంలో అక్కలు, చెల్లెళ్లు తమ సోదరుడిని ఇంటికి పిలిచి భోజనం పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు తమ తమ్ముళ్లు, అన్నలను ఇళ్లకు పిలిచి, వారి అక్కలు, చెల్లెళ్లు విందు భోజనాలు వడ్డించారు. ఈ విధంగా చేస్తే దోషాలు తొలగిపోతాయని వారి నమ్మకం.

దండపాణి విగ్రహావిష్కరణ

బోట్క్లబ్: ఉభయ గోదావరి జిల్లాలకు అయ్యప్ప స్వామి దీక్షను పరిచయం చేసిన దండపాణి గురుస్వామి విగ్రహాన్ని కాకినాడ భానుగుడి సెంటర్లోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. దండపాణి గురు స్వామి శత జయంతి వేడుకల్లో భాగంగా ఈ విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందకరమని ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, చిట్టూరి రవీంద్ర, ఆర్వీ రాయణం, నానాజీ తెలిపారు. తక్కువ రోజుల వ్యవధిలోనే దండపాణి గురుస్వామి విగ్రహాన్ని అందంగా రూపొందించి, అందించిన శిల్పి రాజ్కుమార్ వడయార్ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

మరో విద్యుత్ షాక్

- వ్యాపార సంస్థల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- ముందుముందు రీచార్జి చేసుకోవాల్సిందే..
- పేద వర్గాల పరిస్థితి అయోమయం



సామర్లకోటలోని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయం



సామర్లకోటలోని దుకాణానికి వేసిన స్మార్ట్ మీటర్

సామర్లకోట: విద్యుత్ వ్యవస్థలో స్మార్ట్ మీటర్లతో ప్రజలపై మరింత భారం మోపడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే పెద్దాపురం విద్యుత్ డివిజన్ కార్యాలయం పరిధిలో వ్యాపార సంస్థల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోంది. అయితే వీటికి సంబంధించిన బిల్లింగ్పై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను పూర్తిగా వ్యతిరేకించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు.. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్మార్ట్ మీటర్లు ఆదాని కంపెనీవి కాబట్టి యుద్ధప్రాతిపదిక మీటర్లు బిగించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో మీటర్ల బిగింపును కాంట్రాక్ట్ పద్ధతిలో అప్పగించారు. ప్రస్తుతం ఉన్న విధానంలో విద్యుత్ వినియోగం మేరకు రీడింగ్ తీసి, బిల్లులు ఇచ్చేవారు. బిల్లుల చెల్లింపునకు సుమారు 15 రోజుల పాటు గడువు ఉండేది. దీంతో డబ్బు సర్దుబాటు చేసుకుని బిల్లు చెల్లించే వెసులుబాటు వినియోగదార్లకు ఉండేది. స్మార్ట్ మీటర్ల విధానంలో ముందుగా రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాలెన్స్ ఉన్నంత వరకు స్మార్ట్ మీటర్ల నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. రీచార్జి పూర్తయ్యాక ఆటోమేటిక్గా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది, వినియోగదారులు తిరిగి రీచార్జి చేకునేంత వరకూ అంధకారంలో మగ్గాల్సిందే.

వ్యాపారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన తరువాత ఇళ్లకు మీటర్లు బిగించే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ స్మార్ట్ మీటర్లు అమలులోనికి వస్తే, పేద వర్గాల ప్రజలతో పాటు, చదువు లేని వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. రెగ్యులేటరీ కమిటీతో ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ఏ విధంగా రీచార్జి విధానాన్ని అమలు చేస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. స్మార్ట్ మీటర్ల విధానంతో వీరి నుంచి వ్యతిరేకత వస్తుందని ముందు జాగ్రత్త చర్యగా.. ఎస్సీ, ఎస్టీలకు సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి సర్వేలు పూర్తి చేశారు. వారికి సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించి ఉచిత యూనిట్లు రద్దు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో మొత్తం గృహావసర, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు సుమారు 95 వేలు ఉన్నాయి.

స్మార్ట్ మీటర్లకు పూర్తిగా వ్యతిరేకం



రాష్ట్రంలో అమలు చేయడానికి సిద్ధంగా ఉన్న స్మార్ట్ మీటర్ల విధానాన్ని సీపీఎం పూర్తిగా వ్యతిరేకిస్తోంది. ఇప్పటికే ప్రజల్లో వీటిపై అవగాహన కల్పించి, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాం. ప్రజల నుంచి ముందుగా బిల్లులు వసూలు చేసి, పారిశ్రామిక వేత్తలకు దోచిపెట్టే ప్రక్రియ స్మార్ట్ మీటర్ల వ్యవస్థ. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడతారు. తరచూ పేదల ఇళ్లు అంధకారంలో మగ్గుతాయి. ప్రజలకు అండగా ఎటువంటి ఉద్యమాలు చేయడానికైనా సిద్ధం.

– కరణం ప్రసాదరావు, సీపీఎం పట్టణ కార్యదర్శి, సామర్లకోట

రీచార్జి అపోహ మాత్రమే..



కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్ సంస్థకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మా డివిజన్ పరిధిలో వెయ్యి వరకు మీటర్లు ఏర్పాటు చేశాం. ఈ మీటర్లకు రీచార్జి చేసి వాడుకోవాలనేది ఒక అపోహ మాత్రమే. విద్యుత్ వినియోగం సక్రమంగా జరిగే విధంగా ఈ మీటర్లు ఉపయోగపడతాయి. మీటర్లలో ఎటువంటి తేడా ఉన్నా మార్పు చేస్తారు.

– ఏవీఎస్డీఎస్ ప్రభాకర్, ఏపీఈపీడీసీఎల్, ఈఈ,, సామర్లకోట

ప్రత్యేకాలంకరణలో భీమేశ్వరస్వామి



పంచారామ క్షేత్రంలో స్వామి వారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్తిక మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని సాయంత్రం పట్టు వస్త్రాలతోను, వెండి ఆభరణాలతో అలంకరణ చేశారు. అదే విధంగా అమ్మ వారిని బంగారు కిరీటం, పట్టు వస్త్రాలతో అలంకరించారు.

మద్యం షాపు తొలగించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న మత్స్యకార మహిళలు, మత్స్యకారులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ పాత మార్కెట్ గాంధీనగర్లో ఏర్పాటు చేసిన మద్యం షాపును దూరంగా తరలించాలని ఆదివారం మత్స్యకారులు, మత్స్యకార మహిళలు ధర్నా నిర్వహించారు. జనావాస ప్రాంతాల్లో, అంగన్వాడీ కేంద్రం ఉన్న ప్రదేశంలో, ప్రార్థనా మందిరాలు ఉన్న ప్రాంతాల్లో ఏ విధంగా మద్యం షాపును ఏర్పాటు చేశారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో చిన్న పిల్లలు, విద్యార్థులు, మహిళలు తిరుగుతుంటారని, మద్యం షాపును ఏర్పాటు చేయడం వలన వారికి రక్షణ లేకుండా పోతుందన్నారు. ఈ మద్యం షాపును తొలగించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని మత్స్యకారుల మహిళలు స్పష్టం చేశారు.

15 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు



మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న క్రాంతికుమార్ తదితరులు

పెద్దాపురం: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఎం) కాకినాడ జిల్లా మహసభలు ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయని పార్టీ మండల కన్వీనర్ డి.క్రాంతికుమార్ తెలిపారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం సీపీఎం పట్టణ కార్యదర్శి నీలపాల సూరిబాబు అధ్యక్షతన జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తు పోరాటాలకు ఈ మహాసభ రూపకల్పన చేస్తుందన్నారు. మూడేళ్ల కాలంలో సీపీఎం చేస్తున్న కృషిని విశదీకరించారు. ఈ నెల 15న పుచ్చపల్లి సుందరయ్య జీవిత విశేషాల ఫొటో ఎగ్జిబిషన్, కవి సమ్మేళనం, 16న బహిరంగ సభ, 16, 17 తేదీల్లో ప్రతినిధుల సభ ఉంటాయని వివరించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖా కార్యదర్శి సిరిపరపు శ్రీనివాస్, నాయకులు ఆర్.వీర్రాజు, శుభలక్ష్మి, గడిగట్ల సత్తిబాబు, చల్లా విశ్వనాథం, డి.సత్యన్నారాయణ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ, గూనూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ సంబరం



చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న సంబరం

సామర్లకోట: పట్టణంలోని మంతం సెంటర్లో ఉన్న చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ఉత్సాహంగా బతుకమ్మ(కలశాల) సంబరం జరిగింది. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గౌరీ నందీశ్వర ఉత్సవాలలో భాగంగా గౌరమ్మ అమ్మవారిని ఊరేగిస్తూ బతుకమ్మ ఉత్సవం నిర్వహించారు. దేవాంగుల కులదైవంగా పురస్కరించే వారు ఉత్సవంలో పాల్గొన్నారు. నీలమ్మ చెరువు నుంచి వీర్రాఘవపురం పట్టణ పురవీధుల మీదుగా సంబరం నిర్వహించారు. దేవాంగుల సంఘ నాయకులు భక్తులకు సేవలందించారు. పట్టణ పురవీధుల మీదుగా సాగిన ఊరేగింపు ఆలయానికి చేరిన తరువాత కలశాలను గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. బతుకమ్మ మహిళా కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు.

ఫ్లై ఓవర్పై నిలిచిన లోడ్ లారీ

- ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం
- క్రేన్తో తొలగించిన ట్రాఫిక్ పోలీసులు



సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నిలిచిపోయిన వాహనాలు



ఆగిపోయిన లారీని క్రేన్తో తరలిస్తున్న పోలీసులు

సామర్లకోట: టైర్లు పేలిపోవడంతో స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం సాయంత్రం లోడ్ లారీ నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నలువైపులా వాహనాలు బారులు తీరాయి. ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి ప్రదేశమైన వైఎస్సార్ విగ్రహం నుంచి బస్సు కాంప్లెక్స్ వరకు, పెద్దాపురం ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్ వరకు, వేట్లపాలెం రోడ్డు సుగర్ ఫ్యాక్టరీ వరకు, కాకినాడ రోడ్డులో రైల్వే గేటు వరకు వాహనాలు స్తంభించాయి. కాకినాడ నుంచి వస్తున్న లోడ్ లారీ ఫ్లైఓవర్ బ్రిడ్జి కాకినాడ-వేట్లపాలెం కూడలి ప్రదేశంలో లారీ ముందు టైర్లు పేలిపోయాయి. లారీ ఫ్లైఓవర్ బ్రిడ్జి మధ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తన సిబ్బందిని ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి పంపారు. ట్రాఫిక్ ఎస్సై క్రేన్ ఏర్పాటు చేసి లారీని ఏడీబీ రోడ్డు పెట్రోల్ బంకు వద్దకు తరలించారు. ట్రాఫిక్ ఎస్సై పర్యవేక్షణలో సిబ్బంది ట్రాఫిక్ను క్రమబద్ధీకరించారు. ఎవరికి వారే ఆగి ఉన్న వాహనాలను తప్పించుకుని ముందుకు వెళ్లడంతో, ఎదురెదురు వాహనాలతో ట్రాఫిక్ స్తంభించింది. సుమారు రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: పవిత్ర పంచారామ క్షేత్రమైన శ్రీబాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. కార్తిక మాసం ఆదివారం కావడంతో తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి తెల్లవారుజామున క్షీరాభిషేకం చేశారు. భక్తులు తీసుకొచ్చిన పాలను బిందెలలో పోసి, తెల్లవారుజామున మాత్రమే ఈ అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి నీటితో అభిషేకాలు చేశారు. కేంద్ర పురావస్తు శాఖ ఆదేశాల మేరకు పంచామృతాలతో అభిషేకాలను నిలిపివేశారు. కార్తిక సోమవారం పర్వదినాల్లో మాత్రమే అభిషేకాలు చేస్తున్నారు. అదేవిధంగా ఆలయంలో లక్ష పత్రి పూజలు జరిగాయి. స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో శ్రీచక్ర పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అభిషేక పండితులు అళ్లకి రాజ్గోపాల్శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు భక్త సంఘ నాయకులు సేవలందించారు. స్వామిని, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని సీఐ ఎ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉదయం, సాయంత్రం భక్తులు ధ్వజ స్తంభం వద్ద, రాయిచెట్టు, జమ్మి చెట్టు, ఆలయంలోని తులసీ చెట్టు వద్ద కార్తిక దీపాలు వెలిగించారు.



స్వామి వారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



స్వామి వారికి చేస్తున్న బిల్వార్చన

అక్రమ తవ్వకాలు చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్ సీజ్

కొత్తపల్లి: రాత్రి సమయాల్లో అక్రమ బొండు ఇసుక తవ్వకాలు చేపడుతున్న జేసీబీ, ట్రాక్టర్ని సీజ్ చేసినట్లు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. మండలంలోని పొన్నాడలో శనివారం రాత్రి అక్రమంగా బొండు ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందిందన్నారు. దీంతో వీఆర్వోను ఆదేశించి, అక్రమంగా బొండు ఇసుకను తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు వివరించారు. బొండు ఇసుక తవ్వకాలకు రెవన్యూ పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. తక్షణమే స్థానిక రెవెన్యూ అధికారులను పంపి, తవ్వకాలను చేపడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

● ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



పంచారామ క్షేత్రంలో ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన విశేషంగా ఆకట్టుకుంది. కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో రూ.2,500 చెల్లించి లక్షపత్రి పూజలు చేసుకున్న వారికి ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తారు. లక్షపత్రి పూజలు చేసుకున్న వారితో పాటు, పలువురు భక్తులు జ్యోతిర్లింగంలో దీపాలు వెలిగించడానికి పోటీ పడ్డారు.

చెత్త వేయొద్దంటూ గ్రామస్తుల ఆందోళన



ముత్యాలమ్మ గుడి వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

కొత్తపల్లి: వేరే గ్రామంలో ఉన్న చెత్తను తెచ్చి తమ గ్రామాన్ని ఆనుకుని వేయడంతో స్థానికంగా ఉన్న ముత్యాలమ్మ చెరువు వద్ద ఆదివారం రాత్రి స్థానికులు ఆందోళన చేశారు. డిప్యూటీ సీఎం పర్యటన సోమవారం వాకతిప్పలో ఉంది. దీంతో కొత్తపల్లి పీహెచ్సీ సమీపంలో డంప్ చేసిన చెత్తను పంచాయతీ అధికారులు పారిశుధ్య సిబ్బందితో ట్రాక్టర్లలో ఇక్కడకు తరలిస్తున్నారు. ఈ చెత్తను కొత్తపల్లి గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ గుడి సమీపంలో డంప్ చేస్తున్నారు. ఈ చెత్త అక్కడ వేయడం వలన వర్షం పడితే దుర్వాసన వెదజల్లి, గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.